ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు

సోమవారం 26 ఆగస్టు 2024



ఇసుక రవాణా కోసం కౌండిన్య నదిలో వేసిన రోడ్డు

ప్రభుత్వం మారింది. అయినా.. ఇసుక అక్రమ రవాణా ఆగలేదు. వైసీపీ హయాంలో టిప్పర్ల కొద్దీ పక్క రాష్ట్రాలకు తరలిస్తే.. ఇప్పుడేమో జిల్లాలోనే ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఎందుకంటే.. జిల్లాలో మూడే ఇసుక నిల్వ కేంద్రాలున్నాయి. దీంతో ఇసుక ఉచితమైనా, ఇంటికొచ్చే సరికి రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ క్రమంలో కొందరు టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, సానుభూతిపరులు స్థానికంగా ఉన్న నదులు, చెరువుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ఇసుక లోడింగ్‌కు ఇటీవల సిద్ధంగా ఉన్న ఎక్స్‌కవేటర్

అయినా.. ఆగలేదు

- ప్రభుత్వం మారినా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- నాడు పక్క రాష్ట్రాలకు తరలించిన వైసీపీ నేతలు
- నేడు జిల్లాలోనే టీడీపీ శ్రేణుల వంతు

వైసీపీ ప్రభుత్వంలో పలమనేరు నియోజకవర్గంలోని నాలుగు రోడ్ల కూడలిలో పెద్దఎత్తున ఇసుకను నిల్వ చేసి.. బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకునేవారు. అప్పటి ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలోనే వైసీపీ నేతలు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారన్న విమర్శలుండేవి. ఇప్పుడూ అక్రమ రవాణా ఆగలేదు. కౌండిన్య నదిలో రోడ్లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. వీరికి పోలీసు, రెవెన్యూ శాఖల్లోని కింది స్థాయి సిబ్బంది సహకారం ఉందన్న ఆరోపణలున్నాయి. ఇటీవల పోలీసులు ఇసుకాసుల నుంచి రూ.రెండు లక్షలు వసూలు చేసి పెట్రోల్ బంకులోని అప్పును తీర్చినట్లు ప్రచారం జరుగుతోంది. గంగవరం మండలం బైరెడ్డిపల్లె క్రాస్ వద్ద ఇసుక నిల్వ కేంద్రమున్నా.. కౌండిన్య నదిని మాత్రం వదలడం లేదు.

మట్టి నుంచి ఇసుక తయారీ

కుప్పం నియోజకవర్గంలో ఎక్కడా ఇసుక నిల్వ కేంద్రాలు లేవు. దీంతో చెరువుల నుంచి మట్టిని లోడి.. ఫిల్టర్ చేసి కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారు. పలమనేరు సమీపంలో ఇసుక నిల్వ కేంద్రమున్నా దూరమనే కారణంగా స్థానికులు ఈ కృత్రిమ ఇసుకనే తీసుకెళుతున్నారు. దీనిని వైసీపీ హయాంలో పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేసి వ్యాపారం చేసుకునే వారు. ప్రస్తుతం స్థానికంగా ట్రాక్టర్ ఇసుకను రూ.2 వేలకు విక్రయిస్తున్నారు.

చెరువుల్ని తవ్వేస్తూ..

పుంగనూరు నియోజకవర్గంలోనూ ఇసుక నిల్వ కేంద్రాలు లేవు. దీంతో కొందరు నిల్వ కేంద్రాలున్న చిత్తూరు, పలమనేరు, కలకడ ప్రాంతాల నుంచి ఇసుకను తెచ్చుకుంటున్నారు. దూరం కావడంతో ఒక్కో ట్రాక్టరు ధర రూ.4500 అవుతోంది. అధికార పార్టీ నాయకుల అండదండలున్న వారంతా స్థానికంగా ఉన్న చెరువుల్ని ఛిద్రం చేసి ఇసుకను లోడేస్తున్నారు.

ట్రాక్టరు ఇసుక రూ.2500కు అమ్ముతూ..

పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లెలో విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తున్నారు. వైసీపీ హయాంలో ఇక్కడ రూ.4 వేలకు ఇసుక లభ్యమయ్యేది. ప్రస్తుతం జీడీనెల్లూరు నుంచి పూతలపట్టుకు కొందరు టీడీపీ శ్రేణులు ఇసుకను తెచ్చి రూ.2500కు అమ్ముతున్నారు. కాగా, ఒకరిద్దరు వైసీపీ నేతలు కూడా ట్రాక్టర్లతో వ్యాపారం చేసుకుంటున్నారు.

ఇక్కడ మాత్రం తమిళనాడుకు తరలింపు

జీడీనెల్లూరు మండలంలోని నీవానది ప్రవహించే ప్రాంతాలైన ముక్కళత్తూరు, ఆత్మకూరు, ఎల్లాపల్లె, కలిజవేడు, నందనూరు, కోట్రకోన పంచాయతీల్లో ఇసుక ఉండేది. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు సుమారు 30 అడుగుల లోతు మేర ఇసుకను లోడేశారు. ఇప్పుడు ఆ స్థాయిలో కాకున్నా.. జీడీనెల్లూరు నుంచి పాలసముద్రం మండలం మీదుగా రాత్రిళ్లు తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇలా రోజూ 5 నుంచి 7 టిప్పర్లు తమిళనాడుకు వెళ్తున్నాయి.

ఇసుక ట్రాక్టర్.. ఎప్పుడెంత..?

ప్రాంతం	2018లో (టీడీపీ హయాం)	2019-24 మధ్య (వైసీపీ హయాం)	ప్రస్తుతం
చిత్తూరు	2500	4500-5000	2100-2200
పలమనేరు	2500	3200	2500-3000
పుంగనూరు	2000-3000	4500	4500
పూతలపట్టు	2000	4000	2500
జీడీనెల్లూరు	3000	5000-5500	4000
నగరి	1500	2300	2300

నగరిలో టీడీపీ, వైసీపీ వాళ్లు కలిసి..

నగరి నియోజకవర్గంలో గ్రామ స్థాయి టీడీపీ నాయకులు 30 శాతం, వైసీపీ నాయకులు 70 శాతం ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. నగరిలోని సత్రవాడ, తెరణి, ఏకాంబరకుప్పం ప్రాంతాల్లోకి కుశస్థలి నది నుంచి ఇసుకను తవ్వుకుని స్థానికంగా ఓ ట్రాక్టరు రూ.2300కు అమ్ముకుంటున్నారు. నాగలాపురం మండలం నందనం, అడవి కొడియంబేడు నిల్వ కేంద్రాల్లో రూ.1200 చొప్పున చలానా కట్టి తెచ్చుకుని.. ఇక్కడ రూ.4500 నుంచి రూ.5 వేల వరకు అమ్ముకుంటున్నారు. ఇసుక తవ్వకాల గురించి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు సమాచారం వెళ్లడంతో వారం కిందట రెవెన్యూ అధికారులకు ఫోను చేసి ఎక్స్‌కవేటర్‌తో సత్రవాడ వద్ద కందకం తవ్వించారు.

చిత్తూరు రూరల్‌లో అధిక ధర

చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్‌పేట సమీపంలో రెండు ఇసుక నిల్వ కేంద్రాలున్నాయి. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను ప్రభుత్వం రూ.775కు అందిస్తుండగా.. రూ.1200 ట్రాక్టర్ బాడుగ తీసుకుంటున్నారు. మొత్తంగా చిత్తూరు నగరానికి రూ.2100 నుంచి రూ.2200 మధ్యలో ఇసుక లభిస్తోంది. కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఇంతకుమించి రూ.2800 వరకు వసూలు చేస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఆయన విచారించి ఆ ట్రాక్టర్లను నిలిపేశారు. కొందరు టీడీపీ నేతల అండదండలతో ఆ ట్రాక్టర్లు మళ్లీ రంగంలోకి దిగాయి. ఇక్కడి నుంచి ట్రాకర్టర్లలో ఇసుకను తరలించే వారిలో అధికులు వైసీపీ సానుభూతిపరులే కావడం గమనార్హం.

కౌండిన్యను లోడేస్తున్నారు

పలమనేరు: ఇసుక కోసం కొందరు పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిని లోడేస్తున్నారు. ట్రాక్టర్లలో డంపుల వద్దకు ఇసుకను తరలించి.. చీకటి పడగానే టిప్పర్లతో కర్ణాటకకు తరలిస్తున్నారు. ఇక్కడి ఇసుకకు బెంగళూరులో టిప్పరు రూ.లక్ష పైనే ధర పలుకుతోంది. దీంతో అక్రమ రవాణా ఆగడం లేదు. అధికారులూ పట్టించుకోవడం లేదు. నది ఒడ్డునా లోడేస్తుండటంతో భారీ వృక్షాలు ప్రమాద స్థితికి చేరుకొంటున్నాయి. వీటిపై అటవీ క్షేత్రస్థాయి సిబ్బంది పలుమార్లు ఇసుక ట్రాక్టర్ల యజమానులను హెచ్చరించినా వారు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో సాగిన ఇసుక దందాతో కౌండిన్య నదిపై నిర్మించిన దాదాపు 15 చెక్‌డ్యామ్‌లు కూలిపోవడంతో పరివాహక రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అభ్యర్థన మేరకు ప్రభుత్వం కొత్తగా 15 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయితే, పలుచోట్ల చెక్‌డ్యాంలు నిర్మించేందుకు వీల్లేకుండా భారీ గుంతలు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిఒడ్డును తవ్వేసి ఇసుక తరలించుకు పోతున్న ట్రాక్టర్లు

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా

- నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 25: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బదిలీలు కోరుకునే ఉద్యోగులు తమ వివరాలతో ఆన్‌లైన్‌లో గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారిక పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. దీంతో ఎన్నో రోజులుగా బదిలీలకోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఉపశమనం కలగనుంది. 2019లో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటైంది. 2020 నుంచి దశలవారీగా నియామకాలు చేపట్టింది. జిల్లాలో 612 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 4940 మంది ఉద్యోగులు విధుల్లో కొనసాగుతున్నారు. వీరిలో చాలా మంది 3-4 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారే. వీరి విజ్ఞప్తి మేరకు బదిలీలకు కూటమి ప్రభుత్వం అవకాశమివ్వడంతో హర్షం వ్యక్తమవుతోంది. అత్యవసర పరిపాలన అవసరాల రీత్యా ఉద్యోగులకు జిల్లాపరిధిలో ఏ సచివాలయంలోనైనా అవకాశం ఉంటుందని ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది.

బదిలీల ప్రక్రియ ఇలా...

- ఉమ్మడి జిల్లా పరిధిలోనే నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అంతర్‌జిల్లాల పరిధిలో అవకాశం లేదు.
- ఈనెల 27లోగా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారిక పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- 28న శాఖలకు చెందిన విభాగాలు ఈ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుంటాయి.
- 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలకు అవకాశం కల్పిస్తారు.
- ఉద్యోగులకు అభ్యంతరాలు ఉంటే 30న కలెక్టర్‌కు అర్జీలు ఇవ్వవచ్చు.
- 31తో ఈ ప్రక్రియ ముగుస్తుంది.
- నిర్ణీత తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకాని ఉద్యోగి దరఖాస్తును తిరస్కరిస్తారు.
- మ్యూచ్యువల్, స్పౌస్, మెడికల్, విభిన్న ప్రతిభావంతులు, వితంతువులు రెండేళ్లకు మించి పనిచేసినవారికి అవకాశం కల్పిస్తారు.
- దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత, మానసిక వైకల్యం పిల్లలు కలిగిన ఉద్యోగులకు రెండో ప్రాధాన్యం, ఆ తర్వాత భార్యాభర్తలకు, పరస్పర అంగీకారం కలిగిన వారికి ప్రాధాన్యమిస్తారు.



టపాకాయల నిల్వలపై
పోలీసుల దాడులు

- గంగ్రాజుపల్లెలో రూ.2.65 లక్షల సామగ్రి సీజ్

గంగవరం, ఆగస్టు 25: గంగవరం మండలంలో టపాకాయల అక్రమ నిల్వలపై పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. రెండు రోజుల క్రితం మారేడుపల్లె లో జరిగిన టపాకాయల పేలుడులో భార్యాభర్తలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత మండలంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.శనివారం వైసీపీ నేత భవనంలో రూ.9 లక్షల టపాకాయలు సీజ్ చేశారు. తాజాగా ఆదివారం సాయంత్రం గంగ్రాజుపల్లెలో రాము అలియాస్ రామచంద్ర అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన టపాకాయలను అర్బన్ సీఐ ప్రసాద్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు. వీటి విలువ సుమారు రూ.2.65 లక్షలు ఉంటుందని అంచనా. ఇలా అక్రమంగా నిల్వ ఉంచడం వల్ల ప్రమాదం జరిగితే తీవ్రత ఎలా ఉంటుందో చూస్తున్నారుగా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సు లేకుండా టపాకాయలను నిల్వ ఉంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంకా ఎక్కడైనా గ్రామాల్లో టపాకాయలు నిల్వ ఉంచినట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

జాయింట్ కలెక్టరుగా విద్యాధరి



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు25: జిల్లా జాయింట్ కలెక్టరుగా గొబ్బిళ్ల విద్యాధరిని నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఐటీడీఏ పీవో అభిషేక్‌ను జేసీ నియమించగా తాజాగా ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. అభిషేక్‌ను మళ్లీ ఐటీడీఏ పీవోగానే ఉంచింది. కొత్త జేసీ విద్యాధరి కడప జిల్లా నందలూరుకు చెందిన వారు. ఆమె ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో బీటెక్ చేసి చెన్నైలో ఐఏఎస్ పరీక్షల కోసం సన్నద్ధమయ్యారు. ఐదో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించారు. ట్రిపుల్ ఐటీలో చదివి ఐఏఎస్ సాధించిన తొలి విద్యార్థి ఈమె. 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి అయిన ఈమె జాతీయ స్థాయిలో 211వ ర్యాంకు సాధించారు.

మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీ జిల్లాగా చిత్తూరు

చిత్తూరు, ఆగస్టు 25: పంచాయతీరాజ్ శాఖ ఇచ్చిన నివేదిక మేరకు మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీ జిల్లాగా చిత్తూరును ప్రకటించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-సానిటరీ లెట్రిన్స్ వివరాలపై ఆ శాఖ సర్వే నిర్వహించిందని పేర్కొన్నారు. ఆ నివేదిక మేరకు మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీ జిల్లాగా ప్రకటించామని, అభ్యంతరాలుంటే వచ్చే నెల 2వ తేదీలోపు మున్సిపాలిటీ, మండల ప్రజా పరిషత్ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

చిత్తూరు, ఆగస్టు 25: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కృష్ణాష్టమి కారణంగా రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ అంశాన్ని గుర్తించి వ్యయప్రయాసలు కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని పేర్కొన్నారు.

కోడెగిత్తల పరుగు



పెద్దఉప్పరపల్లెలో పరుగులు పెడుతున్న ఎద్దులను నిలువరిస్తున్న యువకులు

సోమల, ఆగస్టు 25: సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో ఆదివారం పశువుల పండుగ నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించాల్సిన పశువుల పండుగ ఆగింది. దీంతో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా ముందస్తుగా పశువుల పండుగను నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణాలయంలో పూజలు జరిపారు. పశువుల కొమ్ములకు రంగులు పూసి చెక్క పలకలు, టవళ్లు కట్టి అలంకరించారు. పొంగళ్లు పెట్టి గోపూజలు చేశారు. ఉదయం 11 గంటలకే రామాలయం వద్దకు చేరుకున్న జనంతో మిద్దెలు, రామాలయ గోపురం నిండి పోయింది. మధ్యాహ్నం 12 నుంచి గ్రామవీధుల్లో పశువులకు పోటీలు పెట్టారు. రెడ్డివారిపల్లె, చిన్నఉప్పరపల్లె, బసవపల్లె, పెద్దఉప్పరపల్లె, నాగిళ్లవారిపల్లె గ్రామాలకు చెందిన పశువులను పరుగులు పెట్టించారు. వీటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. కొన్ని పశువులకున్న బహుమతులను చేజిక్కించుకున్నారు. పశువుల పండుగ సందర్భంగా గ్రామం జనసంద్రంగా మారింది.

వరసిద్ధుడి ఆలయంలో రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 25: కాణిపాక ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈవో వాణి తెలిపారు. గోశాలలో గోవులకు పూజ నిర్వహిస్తామని, ఉభయదారులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 31న బెంగళూరుకు చెందిన వైదేహి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని అవసరమున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డివిజన్ స్థాయిలో కావాల్సింది 36 మంది టీచర్లు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 25: టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా జిల్లా డివిజన్ స్థాయిలో 36 మంది టీచర్లు అవసరం కాగా 242 ఉన్నారు. 206మంది జిల్లా స్థాయి సర్దుబాటుకు వెళ్లనున్నారు. డివిజన్ స్థాయి సర్‌ప్లస్‌లో స్కూల్ అసిస్టెంట్లు 242 మంది టీచర్లలో బయాజికల్ సైన్స్ 17 మంది, ఇంగ్లిష్‌కు 3, హిందీ 23, తెలుగు 101, మ్యాథ్స్ 14, ఫిజికల్ సైన్స్ 37, సోషియల్ స్టడీస్ 47 మంది ఉన్నారు. బయాలజికల్ సైన్స్‌కు ఏడుగురు, ఇంగ్లిష్‌కు 14 మంది, హిందీకి 10, తెలుగు ముగ్గురు, మ్యాథ్స్‌కు ఒక్కరే అవసరం కానుంది.

పోటెత్తిన భక్తులు

ఇటు కాణిపాకం..



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 25: భక్తుల రద్దీ కారణంగా ఆదివారం కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. సెలవు రోజు కావడంతో స్వామి దర్శనార్థం జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అటు బోయకొండ..

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దర్శనార్థం ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఉదయం అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు అర్చనలు చేసి, స్వరాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.







ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్ద స్లాటెడ్ టోకెన్ల భక్తులు

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు

తిరుమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. శని, ఆదివారాలతోపాటు సోమవారం గోకులాష్టమి వంటి వరుస సెలవుల నేపథ్యంలో శనివారం రాత్రి నుంచే కొండకు వచ్చే భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి మాడవీధులు, అఖిలాండం, లడ్డూ వితరణ కేంద్రం, అన్నప్రసాద భవనం, బస్టాండ్ వంటి ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. సర్వదర్శనం భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శన సమయం పడుతోంది. అలాగే గదుల కోసం భక్తులు సీఆర్వో వద్ద క్యూలో బారులు తీరారు. సిఫార్సుల లేఖలపై గదులు ఇచ్చే పద్మావతి, ఎంబీసీ24, టీబీ కౌంటర్లు కూడా కిటకిటలాడాయి. మరోవైపు తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా రద్దీగా దర్శనమిస్తున్నాయి. స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులతో ఎస్వీ గెస్ట్‌హౌస్ ప్రాంతం సందడిగా మారింది. ఇచ్చిన సమయానికంటే ముందుగానే వచ్చిన భక్తులు ఫుట్‌పాత్‌లపై సేదతీరుతూ కనిపించారు.



కృష్ణతేజ సర్కిల్ వద్ద సర్వదర్శన క్యూలైన్



ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్ద ఫుట్‌పాత్‌పై సేదతీరుతున్న యాత్రికులు

బియ్యం లారీ పట్టివేత

పలమనేరు, ఆగస్టు 25: అరగొండ నుంచి కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలిస్తున్న చౌక బియ్యం లారీని పలమనేరులో పట్టుకొన్నారు. స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ తోట శ్రీనివాసులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున లారీని పట్టుకున్నారు. లారీలో 10 టన్నుల బియ్యం ఉంది. డ్రైవర్, క్లీనర్లను అరెస్టు చేశారు. పలమనేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన బియ్యం లారీ

నేడు, రేపు శ్రీలంక రైతుల పర్యటన

కుప్పం, ఆగస్టు 25: కుప్పం నియోజకవర్గంలో సోమ, మంగళవారాల్లో రెండురోజుల పాటు శ్రీలంక రైతుల బృందం పర్యటిస్తుందని జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు తెలిపారు. శ్రీలంక దేశానికి చెందిన అమృత భూమి ప్రాజెక్ట్ నుంచి 20 మంది రైతుల బృందం నియోజకవర్గంలోని ప్రకతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తుందని వివరించారు. ఇక్కడ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా, సమర్థంగా, ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలకు అనుగుణంగా అమలు జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను ఆ బృందం పరిశీలించనున్నట్లు తెలిపారు.

ప్రతి సంఘం సభ్యురాలూ లక్షాధిపతి కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మహిళా సంఘ సభ్యులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 25: స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళా సభ్యురాలు లక్షాధిపతి కావాలన్నదే ప్రభు త్వ ఆశయమని ప్రధాని మోడీ అన్నారు. ఆదివారం మహారాష్ట్ర జలగాన్ నుంచి స్వయం సహాయక సంఘ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పీఎం ప్రసంగ వీక్షణకు కలెక్టరేట్ డీఆర్‌ఏ పీడీ తులసి, ఎల్‌డీఎం హరీష్ పాల్గొనగా, మండల, గ్రామీణ స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మహిళలు ఆర్థికంగా బలపడటమే ప్రధాన సంకల్పమన్నారు. అనంతరం స్త్రీనిధి, ఉన్నత తదితర రుణాల కింద 5,738 మంది సభ్యులకు రూ.117.30 కోట్ల చెక్ అందజేశారు. డీపీఎం రవి, ఏపీఎంలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

చెల్దిగానిపల్లెలో దొంగల స్వైరవిహారం

● భారీగా వెండి, బంగారం చోరీ

రామకుప్పం, ఆగస్టు 25: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో శనివారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. తాళాలు వేసిన ఇంటి తలుపులు బద్దల గొట్టి భారీగా వెండి, బంగారం తీసుకెళ్లారు. బాధితులు తెలిపిన ప్రకారం.. దేవేంద్ర, ఆయన భార్య గ్రామంలో వ్యవసాయం చేస్తూ.. జాతీయ రహదారి పక్కన తమ ఇంట్లో నివసిస్తున్నారు. శనివారం సాయంత్రం వారు బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్న కుమార్తె, కుమారుడు వద్దకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. వస్తువులు చిందరవందరగా పడున్నాయి. బీరువాలో 1.30కిలోల వెండి, 82గ్రాముల బంగారం, రూ.20వేలు నగదు దుండగులు తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు దేవేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దుండగులు పగులగొట్టిన తలుపు, బీరువా

తెలుగు భాష వైభవానికి మరిన్ని సంస్కరణలు రావాలి

● తెలుగు వెలుగు సాహితీ సమావేశంలో గోరటి వెంకన్న ఆకాంక్ష

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 25: తెలుగు భాష వైభవానికి ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు తీసుకు రావాలని ప్రముఖ గేయ రచయిత, తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆకాంక్షించారు. చిత్తూరులో ఆదివారం భారతీయ తెలుగు రచయితల సంఘం, ఎంవీ కేశవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు వెలుగు సాహితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి భాషకు ఒక సంస్కృతి ఉంటుందని, ఆ సంస్కృతులు అంతరిస్తేనే భాషలు అంతరిస్తాయన్నారు. తెలుగు సంస్కృతి చాలా చరిత్ర కలదని, దేశభాషలందు తెలుగుభాష లెస్స అన్న రాయలు, తెలుగు పద వైభవాన్ని, ఆధ్యాతికతను జోడించి విశేష ప్రచారం చేసిన మహనీయలు అన్నమయ్య, త్యాగయ్య, వేమన, బ్రహ్మంగారు, శ్రీశ్రీ ఆద్యులన్నారు. సమాజ చైతన్యానికి రచయితలు చేసే సేవలు అనంతమన్నారు. సాహితీరంగం పట్ల కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుండటాన్ని సాహితీవేత్తలంతా ఖండించాలని సినీ మాటల రచయిత చిన్ని కృష్ణ పిలుపునిచ్చారు. కేంద్ర సాహితీ అవార్డుల పేరుతో సాహితివేత్తలకు రూ.కోటి, 1000 చదరపు అడుగుల ఇంటి స్థలం, ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలను కల్పించాలని డిమాండు చేశారు. తాను తెలుగు మూలాలున్న వ్యక్తినని, తన వ్యాపారాల్లో తెలుగు వారికే అవకాశాలు కల్పిస్తున్నట్లు మాజీ రాష్ట్రపతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, వి.వి.గిరిల మనవడు డాక్టర్ సుబ్రమణ్యం శర్మ పేర్కొన్నారు. ఆయన ప్రసంగిస్తుండగా గోరటి వెంకన్న, చిన్నికృష్ణ పాదాభివందనం చేయడంతో సభికులు చప్పట్లతో అభినందించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు నారాయణస్వామి, ఓం శ్రీధర్‌రెడ్డి అతిథులను సత్కరించారు. సీపీ బ్రౌన్ సంస్థ నిర్వాహకులు లక్ష్మిరెడ్డి, మర్రిపూడి దేవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న గోరటి వెంకన్న

మిలటరీస్కూల్స్ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకు చివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్‌ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024



అమ్మవారి ఆలయం వద్ద ఆక్టోపస్ మాక్‌డ్రిల్

తిరుచానూరు, ఆగస్టు 25: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామును టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, ఆక్టోపస్ దళం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు చొరబడినపుడు ఏదైనా అత్యవసర పరిస్థితులు వాటిల్లినపుడు ఎలా ఎదుర్కోవాలి.. భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను మాక్‌డ్రిల్ ద్వారా చేసి చూపించారు. ఆక్టోపస్ దళాలు రాష్ట్రంలోని ప్రముఖ స్థలాలు, ఆలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏటా మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో వీజీవో నందకిషోర్, ఏవీఎస్వో సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పులిబోనుపల్లె వద్ద ఏనుగు మృతి



ఏనుగు కళేబరం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25: తలకోన అటవీ సరిహద్దు గ్రామం ఎర్రావారిపాలెం మండలంలోని పులిబోనుపల్లె వద్ద ఓ ఏనుగు మృతి చెందింది. సుమారు ఆరేళ్ల వయసున్న ఈ గజరాజు నాలుగు రోజుల కిందట చనిపోయినట్లు అటవీ అధికారులు ఆదివారం ఉదయం ఆలస్యంగా గుర్తించారు. తలకోన అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల వేట జోరుగా సాగుతోంది. 11 కేవీ లైను నుంచి కరెంటు తీసి, కొందరు వేటాడడం జరుగుతుంది. అయితే ఏనుగు అనారోగ్యంతో మరణించిందా లేక విద్యుతాఘాతమా అన్నది పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలియనుంది. ఈ ప్రాంతంలో ఇది రెండో సంఘటన. గతంలో నాటు బాంబు నమిలి గున్నఏనుగు మృతి చెందింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 'గజ' మరణ ఘోష

◆ 14 ఏళ్లలో 46 మృతి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లా అడవుల్లో వన్యపాణులకు రక్షణ కరువైతున్నది. 14 ఏళ్లలో 46 ఏనుగు మృత్యువాత పడ్డాయి. కారణాలు ఏవైనా అరుదైన ఏనుగులు మృతి చెందడం జరుగుతూనే ఉండడంతో వన్యపాణి ప్రియులు ఆవేదన చెందుతున్నారు.

సంవత్సరాల వారీగా మరణాలు

- 2010లో ఎర్రావారిపాలెం చింతగుంట గ్రామం కృష్ణయ్య పొలంలో కరెంట్ షాక్‌తో ఒక ఏనుగు మృతి.
- 2011లో దేవరకొండ గ్రామం తిమ్మారెడ్డి మామిడితోపులో బావిలోపడి గర్భంతో ఉన్న ఆడ ఏనుగు మృతి.
- 2012లో సిద్దలగండి ప్రాజెక్టులో నీటి కోసం వెళ్లిన గున్నఏనుగు ఊబిలో దిగబడి మృతి.
- 2013లో కరెంట్ షాక్‌తో ఓ ఏనుగు మృతి. కుప్పంలో విద్యుత్ షాక్‌తో మూడు గజరాజులు మృత్యువాత పడ్డాయి.
- 2014 కౌండిన్య అభయారణ్యంలో అనారోగ్యంతో ఓ ఏనుగు మృతి.
- 2015లో పులుబోనుపల్లె వద్ద నాటుబాంబు నమిలి ఏనుగు దుర్మరణం. రామకుప్పం అడవిలో ఒకటి, ఎర్రావారిపాలెం సుబ్బరామాపురం వద్ద కరెంట్ షాక్‌తో మరో ఏనుగు మృతి.
- 2017లో ఎర్రావారిపాలెం కోటకాడ పల్లె వద్ద విద్యుత్ షాక్‌తో ఏనుగు మృత్యువాత.
- 2018 రామకుప్పం శెట్టిపాలెం పొలాల్లో విద్యుత్ షాక్‌తో ఏనుగు మరణం.
- 2019లో ననియాల అడవులోని చెత్తపెంట వద్ద ఒకటి, పలమనేరు గొబ్బిళ్లటూరు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మరో ఏనుగు మృతి. ఇదే ఏడాది ననియాల అడవులో ఆడ ఏనుగును మదపుటేనుగు గుద్ది చంపింది. కుప్పం ప్రాంతంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ఒకటి మృతి. ఇదే ఏడాదిలోనే తమిళనాడు-ఆంధ్ర సరిహద్దులో రైల్వే ట్రాక్‌పై ఎనిమిది గజరాజుల మృతి. కోటకాడపల్లె వద్ద అనారోగ్యంతో ఒకటి, ఐరాల వద్ద రెండు ఏనుగులు కరెంట్ షాక్‌తో మృతి చెందగా.. రైతు గోతితీసి పూడ్చివేశారు. బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లె వద్ద పొలంలో విద్యుత్ షాక్‌తో ఓ ఏనుగు మృతి.
- 2020లో చిత్తూరు సమీపంలోని గంగవరం వద్ద విద్యుత్ షాక్‌తో ఏనుగు మరణం.
- 2021లో పలమనేరు కోతిగుట్ట వద్ద ట్రాన్స్‌ఫారం ఢీకొని ఏనుగు మరణం, ఇదే మండలంలో విద్యుత్ షాక్‌తో ఒంటరి ఏనుగు మృతి. బంగారుపాలెం రాగిమానుపెంట వద్ద, సోమల మండలంలో విద్యుత్ వైర్లు నమలడంతో రెండు మృతి. కార్వేటినగరం మండలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో ఓ ఏనుగు మృతి.
- 2022లో సదుం చెరుకువారిపల్లె వద్ద విద్యుత్ షాక్‌తో ఒకటి. మొగిలి ఘాట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఒకటి, బంగారుపాళ్యం మండలం చిట్టేరి మామిడితోపులో విద్యుత్ షాక్‌తో ఒకటి. టేకు మంద వద్ద స్తంభాన్ని ఢీకొనడంతో తీగలు తెగిపడి ఒకటి. మొగిలిపెంట వద్ద మామిడి చెట్లు విరిచే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి ఒకటి. టేకుమంద కొణతలముడుగు సమీపంలో పూలవానికుంట వంక వద్ద మామిడితోటలో విద్యుత్ తీగలు నమలడంతో గర్భంతో ఉన్న ఏనుగు మృతి.
- 2023లో మొగిలి ఘాట్ వద్ద మినీలారీ ఢీకొని మూడు ఏనుగులు మృతి. బైరెడ్డిపల్లె నెల్లిపల్లి పంచాయతీ నల్లగుట్టపల్లె వద్ద తమిళనాడు నుంచి వచ్చి ఆరు ఏనుగుల మంద విద్యుత్ స్తంభం గుద్దడంతో వైరు పైనబడి ఒకటి మృతి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.87 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 79,521 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 40,152 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

త్వరగా భక్తులకు లడ్డూలు అందజేయండి

- అధికారులను ఆదేశించిన అదనపు ఈవో

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): భక్తులు రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో నిరీక్షణ సమయాన్ని తగ్గించి త్వరితగతిన లడ్డూలు అందజేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని లడ్డూకాంప్లెక్స్‌లో ఆయన ఆదివారం తనిఖీలు నిర్వహించారు. భక్తులు లడ్డూలు పొందే పద్ధతులను పరిశీలించి అధికారులు పలు సూచనలు చేశారు. అంతకుముందు శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధులను పరిశీలించారు. అక్టోబరు 4నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ఆలయ డిప్యూటీఈవో లోకనాథంతో కలిసి భక్తులు గ్యాలరీల్లో ప్రవేశించే, బయటకు వచ్చే మార్గాలను స్వయంగా చూశారు. ప్రత్యేకంగా గరుడసేవ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వీరితోపాటు వీఎస్వో సురేంద్ర, ఏవీఎస్వో మనోహర్ ఉన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా..

తిరుమలలో 8 ప్రథమ చికిత్స కేంద్రాలు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): రానున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో ఎనిమిది ప్రథమ చికిత్స కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈక్రమంలో భక్తులకు అసౌకర్యం లేకుండా టీటీడీ వైద్య విభాగం ఆధ్వర్యంలో నూతన చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇప్పటికే తిరుమల, తిరుపతిలో శాశ్వతంగా ఆరు డిస్పెన్సరీలు, ఆరు ప్రథమ చికిత్స కేంద్రాలలో భక్తులకు, ఉద్యోగులకు, స్థానికులకు టీటీడీ వైద్య సేవలు అందిస్తోంది. కాగా, బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం అదనంగా తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో 2, రాంభగీచ అతిథిగృహాలు, వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం, పాపవినాశనం, ఏడవమైలు వద్ద ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

మా కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

● పెద్దిరెడ్డిని హెచ్చరించిన చల్లా బాబురెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా బాబురెడ్డి

కల్లూరు, ఆగస్టు 25: కూటమి పార్టీల కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి (బాబురెడ్డి) హెచ్చరించారు. పులిచెర్ల మండలం కూనపల్లి సమీపంలో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో తన అరాచకాలను ఖండించిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యే శ్రీనివాసులుకు చిత్తూరు ఎమ్మెల్యే టిక్కెట్టు రాకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడ్డుకున్నారు. అయితే వేంకటేశ్వరస్వామి పాదాల చెంత ఉన్న తిరుపతికి వెళ్లిన శ్రీనివాసులు జనసేనపార్టీ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిచారు. పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ అవినీతిపై నోరెత్తిన టీడీపీ కార్యకర్తలపై పోలీసులను అడ్డుపెట్టుకుని పెద్దిరెడ్డి అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపించారు. పెద్దిరెడ్డి అవినీతి, అరాకాలపై విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్' అంటూ హెచ్చరించారు. జగన్మోహన్‌రెడ్డి రాక్షస పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చల్లా రామచంద్రారెడ్డి పుంగనూరులో పోరాడి స్వల్ప ఓట్లతో ఓటమి చెందారని, వచ్చే ఎన్నికల్లో జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో ఆయన గెలుస్తారన్నారు. 2019 ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వండని సీఎం అయిన జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గంగా పాలించాడన్నారు. ఐదేళ్ల కాలంలో జగన్ చేసిన అరాచకాలతో ఇక ఎప్పటికీ జగన్ సీఎంకాలేడన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో ఏపీని అవినీతి ప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పరదాల చాటున, ప్రజలకు దూరంగా తిరిగిన జగన్మోహన్‌రెడ్డి 11 సీట్లకు పరిమితమయ్యాడన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాసిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంగళంపేట నుంచి కొత్తపేట మీదుగా కొమ్మిరెడ్డిగారిపల్లి వరకు జనసేన పార్టీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేనపార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ, బీజేపి, జనసేనపార్టీ నాయకులు రామనాధం నాయుడు, మురళీధర్, కుమార్‌రెడ్డి, రవినాయుడు, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, గోపినాయుడు, చిన్నరాయల్, సామంచి శ్రీనివాసులు, నవీన్‌రాయల్, మదన్‌మోహన్, శివకుమార్, జనార్దన్, లోకేష్, రమణ, చంద్రబాబు, మునీష్, మునికృష్ణ, మునిశేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

దిష్టి పూజను క్షుద్ర పూజలంటూ..!

కుప్పం, ఆగస్టు 25: కుప్పంలో దిష్టిపూజను క్షుద్రపూజలంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. ప్యాలస్ రోడ్డులో ఆంధ్రాబ్యాంకు ఎదురుగా డివైడర్ల మధ్యలో ముగ్గువేసి, ఎర్రటి గుడ్డపేలికతోపాటు కొబ్బరికాయ కొట్టి, పసుపు కుంకుమలు చల్లిఉండడం స్థానికుల కంటి పడింది. రక్తపు మరకలు కూడా ఈ ముగ్గు చుట్టుపక్కల కనిపించాయి. తెల్లవారుతూనే ఈ దృశ్యం చూసిన కొంతమంది వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అంతే, పట్టణంలో క్షుద్ర పూజలు చేశారన్న ప్రచారం జోరందుకుంది. సాధారణంగా ఇంట్లో ఎవరికైనా ఆరోగ్యం బాగులేకుండా దీర్ఘకాలం తీసుకుంటున్నా, లేక కుటుంబ పరంగా ఏదైనా కష్టనష్టాలున్నా, ఇటువంటి పూజలు చేయడం కుప్పం ప్రాంతంలో మామూలు. కానీ సామాజిక మాధ్యమాల్లో ఉన్నవీ లేనివీ కల్పించి ప్రచారం చేయడంతో క్షుద్ర పూజలు జరిగాయన్న ప్రచారం మాత్రం విస్తృతంగా జరిగింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కుప్పంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



సిద్ధమైన వేదిక వద్ద ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

కుప్పం, ఆగస్టు 25: కుప్పంలో ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించబోయే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడులకు ఆదివారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్యాలెస్ రోడ్డులోని జమీందారు బంగళా సమీపంలో శ్రీకృష్ణ ప్రతిష్ఠాపనకు వేదిక సిద్ధం చేశారు. సోమవారం ప్రారంభమయ్యే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈనెల 31న ఊరేగింపుతో ముగియనున్నాయి. ఆదివారం జరిగిన ఏర్పాట్లలో ప్రబోధ సేవా సమితి కుప్పం అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు నాగరాజు, ప్రకాశ్, కృష్ణా రెడ్డి, వెంకటేశ్, శివకృష్ణ, కుమార్, కృష్ణ, ఇందిర, వెంకటలక్ష్మి, రాధ, పూజ, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎల్ క్రికెట్ విజేత జల్సా బాయ్స్



కుప్పం, ఆగస్టు 25: కుప్పంలోని కొత్తపేట ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నీ విజేతగా జల్సా బాయ్ జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఈ జట్టు ప్రత్యర్థి జట్టును ఓడించి విజేత అయింది. విజేత జట్టు జల్సాబాయ్స్‌కు రూ.31,111 నగదు రివార్డుతోపాటు ట్రోఫీని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, చెక్కునత్తం మణి, జేకే.సంతోశ్, సోము, మంజునాథ్, అప్పు, ఇర్ఫాన్, లయన్స్ క్లబ్ సభ్యులు అందజేశారు.

వైభవంగా లక్ష్మీవెంకటేశ్వరుల కల్యాణం



పలమనేరు, ఆగస్టు 25 : మండలంలోని రామాపురం, రంగినాయనిపల్లి, కమలాపురం గ్రామాలకు సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు అనంతరామాచార్ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం దేవేరులను పుష్పపల్లకిలో ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారం కోసం జనసేన పల్లెబాట



సమావేశం నిర్వహిస్తున్న అమీర్

గుడుపల్లె, ఆగస్టు 25: గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు జన సైనికులు పల్లెల్లో అందుబాటులో ఉండాలని జనసేన మండల అధ్యక్షుడు అమీర్ పేర్కొన్నారు. ఆదివారం గుడుపల్లె జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించిన కూటమి నాయకులను అభినందించారు. మండల కేంద్రంలో సెప్టెంబరు 2వ తేదీన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడానికి నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మణికంఠ, రాజేష్, గణేష్, హంసగిరి, జాన్, హిమద్, ప్రకాష్, నాగ, సందీప్, రాము, ఆనంద్, రవి, మణి, జాకీర్, వెంకటేశ్, అమల, నాగరాజు, దివాకర్, ఫణి బాబు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికస్వావలంబనకు ఎన్డీయే కృషి



చెక్‌ను పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

రామకుప్పం, ఆగస్టు 25: మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి కృషిచేస్తోందని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం రామకుప్పంలో వారు 'లక్పతిదీదీ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు స్వయంసహాయక మహిళా సంఘాల సభ్యులకు రుణ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీఓ లావణ్య, నాయకులు కొల్లపల్లె బాబు, గిరిదాసు, వెంకటరమణ, సుబ్రీ, మంజునాథ్, అల్లీశీన, పెరుమాళ్, కేశవరెడ్డి, పద్మమ్మ, మంజునాథరెడ్డి, రఘు, మురళీ, జేయి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ బూత్‌లో 200 సభ్యత్వాలు చేయండి



బీజేపీలో చేరిన నాగేంద్ర, శ్రీహరిలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జి.ఆర్.ప్రభాకర్

పలమనేరు, ఆగస్టు 25 : పలమనేరు మున్సిపాలిటీ, పలమనేరు మండలంలోని ప్రతిపోలింగ్ బూత్ పరిధిలో 200 మంది బీజేపీ సభ్యత్వం తీసుకునేలా నాయకులు కృషిచేయాలని ఆ పార్టీ పలమనేరు నియోజకవర్గ కన్వీనర్ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పలమనేరులో బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సభ్యత్వనమోదులో చురుగ్గా పాల్గొనాలని కోరారు. అనంతరం పెంగరగుంట గ్రామానికి చెందిన శ్రీహరి, నాగేంద్ర బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బీజేపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శరవణకుమార్, పలమనేరు బీజేపీ అధ్యక్షులు మొగిలీశ్వర్, నాయకులు శ్రీరాములయ్య, వెంకటాద్రి, వార్డెన్ క్రిష్ణయ్య, దేవరాజు, గేట్ వంశీ, గిరి, గోవిందయ్య, మనోహర్‌గుప్తా, రాజశేఖర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన ఎస్‌కే కుటుంబ సభ్యులు



చౌడేపల్లె, ఆగస్టు25: సీఎం చంద్రబాబును బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్‌కే వెంకట రమణారెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మనవడు హరిరుద్రంసరెడ్డి తొలిపుట్టిన రోజు సందర్భంగా చంద్రబాబును కలిసి ఆశీర్వాదం తీసుకున్నట్లు వివరించారు. పుంగనూరు నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తనకు అండగా ఉంటానన్నారు. ఆలయాల అభివృద్ధే తన జీవిత లక్ష్యమని ఆయనకు విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సతీమణి రతీదేవి, కుమారుడు రాజశేఖర్ రెడ్డి, కోడలు స్నేహలతారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



చౌడేపల్లె, ఆగస్టు25: విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు..మండలంలోని మేకలచిన్నేపల్లెకు చెందిన దేవిరెడ్డికి వ్యవసాయంతో పాటు ఆవులు ఉన్నాయి. ఆదివారం గ్రామం సమీపంలోని తన పొలంలో ఆవులు మేత మేస్తుండగా ఓ ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో చనిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆవు రూ.55వేలు ఉంటుందని వాపోయారు.

పుంగనూరు ప్రైవేటు పాఠశాల సంఘం అధ్యక్షుడిగా రాజమోహన్‌రెడ్డి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

పుంగనూరు రూరల్, ఆగస్టు25: పుంగనూరు ప్రైవేటు పాఠశాల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక శారద పాఠశాల ఆవరణలో జరిగిన ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌ల సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, అధ్యక్షులుగా రాజమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా షాకీరుల్లా, కోశాధికారిగా మహ్మద్ అంజాద్, సభ్యులుగా శివకుమార్‌రాజు, మహేంద్రబాబు, ద్వారక తదితరులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల సమస్యలను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

చల్లా బాబును కలసిన రజకసంఘ నాయకులు



పుంగనూరు, ఆగస్టు25: పుంగనూరులో నూతనంగా ఎంపికైన రజక సంఘ నాయకులు టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కలిశారు. ఆదివారం స్థానిక దోబీ కాలనీకి చెందిన రజక సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా రమేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన సంఘ నాయకులతో కలిసి చల్లాబాబును కలిశారు. దోబీకాలనీకి ఎన్టీఆర్ కాలనీగా మార్పు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి జనసేన నాయకులు నరేశ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 25: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన యునైటెడ్ పెన్షన్ సిస్టం కాకుండా పాత పెన్షన్ విధానం కావాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖరనాయుడు అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జీపీఎస్‌కు మరో రూపమే యూపీఎస్ అని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్ర కార్యదర్శి రమణ కోరారు. మణిగండ, సుధాకర్, మునిరత్నం, రహనాబేగం పాల్గొన్నారు.

గమ్యం చేరని పల్లెవెలుగులు



నడిరోడ్డుపై ఆగిపోయిన పలమనేరు డిపో పల్లెవెలుగు బస్సు

పలమనేరు, ఆగస్టు25 : పలమనేరు డిపోలోని ఆర్టీసీ బస్సుల్లో ఎక్కిన ప్రయాణికులకు గమ్యం చేరుతామన్న నమ్మకం పోయింది. ఈ డిపోలోని బస్సులు కాలం చెల్లినవి కావడంతో ముఖ్యంగా పల్లెవెలుగు బస్సులు బస్టాండు నుంచి బయలు దేరితే ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి. ఆదివారం కుప్పం నుంచి పలమనేరుకు వస్తున్న పల్లెవెలుగు బస్సు పలమనేరుకు మరో ఐదు కిలోమీటర్ల దూరం ఉండగా మొరాయించింది. నడిరోడ్డుపై ఆగిపోయింది. ప్రయాణికులు వేరే బస్సుల్లో వెళ్లాల్సి వచ్చింది.

అప్పుడు ప్రథమ.. ఇప్పుడు అథమం

ఒకప్పుడు జిల్లాలోనే ఆదాయంలోనూ, క్రమశిక్షణలోనూ, కిలోమీటరుకు ఆదాయం అధికంగా తీసుకొచ్చే డిపోగా పలమనేరు డిపోకు పేరుండేది. ప్రస్తుతం జిల్లాలోనే అథమ స్థాయికి పడిపోయింది. డొక్కు బస్సులను నడపాలంటే ఇక్కడి డ్రయివర్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉదయం డ్యూటీ ఎక్కిన డ్రైవర్లు సాయంత్రం అయ్యే సరికి ఒళ్లంతా హూనమైపోతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన బస్సులకు రంగులేసి రోడ్డుపైకి వదులు తున్నారు. ఇంజన్ కాలం చెల్లిపోయినా, స్పీడో మీటరు తిరగక పోయినా, వైపర్లు పనిచేయకపోయినా, కిటికీలకు అద్దాలు లేకపోయినా, ఫస్టుఎయిడ్ బాక్సులు లేకపోయినా, గేర్లు సక్రమంగా పడకపోయినా తిప్పుతున్నారు. ఆర్టీసీ కార్పొరేషన్ కాస్త ప్రభుత్వ సంస్థగా మారడంతో రవాణా శాఖ అధికారులు ఎఫ్‌సీలు చేసి పంపిస్తున్నారనే విమర్శలున్నాయి.

తరలిపోయిన బస్సులు తిరిగి రప్పించేరా..!

గత నెల ఇక్కడి పలమనేరు పరిరక్షణ సమితి, పలమనేరు డిపోలో పనిచేస్తున్న సిబ్బంది ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో మాట్లాడారు. పలమనేరు డిపో దుస్థితి గురించి వివరించారు. ఇక్కడి డిపోలోని బస్సులను ఇతర డిపోలకు తరలించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తెలియజేశారు. నెలరోజుల్లోపు సమస్యలన్నీ పరిష్కారమవు తాయని ఆయన హామీ ఇచ్చారు. ఆ క్రమంలో డిపో అధికారులతో సమావేశం నిర్వహించి ఇక్కడి డిపోనుంచి బయట డిపోలకు వెళ్లిన బస్సులను వెనక్కు తెప్పించాలని సూచించారు. కానీ ఇంకా అది కార్యరూపం దాల్చలేదు. ఇటీవల ఆర్టీసీకి త్వరలోనే దాదాపు 1500 పైగా కొత్త బస్సులు వస్తాయని రవాణా మంత్రి పేర్కొన్నారు. వచ్చే బస్సులలో కొన్నింటినైనా పలమనేరు డిపోకు కేటాయించాలని ఇక్కడి ప్రయాణికులు కోరుతున్నారు.

నత్తనడకన ఏఎంసీ యార్డు నిర్మాణ పనులు



అద్దె గదిలో నడుస్తున్న ఏఎంసీ కార్యాలయం

సోమల, ఆగస్టు 24:: సోమలలో మార్కెట్ యార్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సోమలలో 1994లో వ్యవసాయ మార్కెట్ కమిటీ సదుం, సోమల మండలాలకు సంయుక్తంగా ఏర్పాటైంది. అప్పటి నుంచి సోమల సింగిల్ విండో కార్యాలయంలోనే నేటి వరకు అద్దె గదిలో కొనసాగుతోంది. ఈ క్రమంలో ఏఎంసీ యార్డు నిర్మాణ పనులకు రూ.4 కోట్లు కేటాయించారు. సోమల - కందూరు మార్గంలోని పుల్లయ్యతాత కుంట వద్ద ప్రభుత్వ, ప్రైవేటు స్థలంలో ఏఎంసీ నిర్మాణ పనులు చేపట్టారు. నాలుగేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించింది. కాంట్రాక్టరు పనుల్లో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో యార్డుపై ఆశలు పెట్టుకున్న మామిడి, టమోటా రైతులు నిరాశలో ఉండిపోయారు. సోమల మండలంలో 10 వేల ఎకరాలకు మించి మామిడి సాగులో ఉంది. వందల ఎకరాల్లో టమోటా సాగవుతోంది. రైతులు టమోటాలను పలమనేరు, మదనపల్లె, కలికిరి, కలకడ, తిరుపతి, పుంగనూరు ప్రాంతాలకు తరలించి అమ్ముకోవాల్సి వస్తోంది. సోమల మండలం నుంచి నిత్యం 20 లారీల టమోటాలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. ఇక మామిడి రైతులు మామిడి మండీదారులకు విక్రయిస్తున్నారు. యార్డు నిర్మాణాలు పూర్తిచేసి దుకాణాలకు అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. రైతులకు వ్యయప్రయాసలు తప్పుతాయి. అధికారులు స్పందించి త్వరగా యార్డు నిర్మాణాలు పూర్తిచేయించాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మార్కెట్ యార్డు వద్దే రెండేళ్ల క్రితం రూ.60లక్షలతో నియోజకవర్గ స్థాయిలో భూసార పరీక్షలు, మట్టినమూనా సేకరణ , పరిశోధన కోసం సైన్స్ ల్యాబ్‌కు శ్రీకారం చుట్టారు. ఆపనులు కూడా ముందుకు సాగడం లేదు.

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం



మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 25: మహిళాసంఘ సభ్యులను లక్షాధికారులను చేయడమే ప్రధాని మోదీ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మహిళా సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా లక్‌పతి దీదీ పథకాన్ని ప్రవేశపెట్టుతున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని మహిళా సంఘాల్లోని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు విరూపాక్షి, నాయకులు శమీపతి, రెడ్డెప్పయాదవ్, గంగులప్ప, వెంకటమరణ, మణి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యంలో ఆక్రమణల తొలగింపు



చౌడేపల్లె, ఆగస్టు25: స్థానిక గోసల కురప్పల్లెలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమిలో ఆక్రమణలను ఆలయ ఈవో కమలాకర్ ఆధ్వర్యంలో తొలగించారు. ఆదివారం ఆలయ సమీపంలో ఉన్న మాన్యంలో ఉన్న బంకులు, సెంట్రింగ్ కొయ్యలను గ్రామస్థుల సహకారంతో తొలగించారు. కాగా బస్టాండులో ఉన్న ఆక్రమణలు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి గన్‌మెన్లు, పలువురు వైసీపీ నాయకులు చేపట్టిన అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లకపోవడం గమనార్హం.

ప్రతి కుటుంబానికీ ఆర్థికభరోసా ఇవ్వడమే ధ్యేయం



మహిళలకు చెక్కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

సోమల, ఆగస్టు 25: ప్రతి కుటుంబానికీ ఆర్థిక భరోసా ఇవ్వాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని జిల్లా సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి కే. శ్రీని వాసులునాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వెలుగు సంఘాలకు ప్రధాన మంత్రి 'లక్పతి దీదీ' కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని వీక్షించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం శివ మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామ సంఘం నుంచి, స్త్రీనిధి ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని వివరించారు. అనంతరం పలు సంఘాలకు రుణాల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివశంకర్, అష్రఫ్ అలీ, మహేంద్రబాబు, మణియాదవ్, భాగ్యమ్మ, సీసీలు గంగోజీ, నరసింహులు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆలయాలు ముస్తాబు



పుంగనూరు, ఆగస్టు25: గోకులాష్టమి సందర్భంగా పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద యాదవులు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక కృష్ణమరెడ్డిపల్లె మార్గంలో వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం వేకువజాము నుంచి హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మామిడి, అరటి తోరణాలు కట్టారు. ఉట్టి కొట్టేందుకు ఏర్పాటు చేశారు. యాదవ కులస్తుల ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పపల్లకిలో పురవీధుల్లో ఊరేగించనున్నారు. ఈ కార్యక్రమంలో భజనలు, పిల్లనగ్రోవి, నృత్యాలు, గోమాతల ఊరేగింపు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం

గుడిపాల, ఆగస్టు 25: మండలంలోని వేలూరు-చిత్తూరు జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ రామ్మోహన్ వివరాల మేరకు.. 190 రామాపురం సీఎంసీలో పనిచేస్తున్న తమిళనాడు రాష్ట్రం విరుదంబట్టుకు చెందిన సతీష్ కృపాకరన్, వేలూరుకు చెందిన సుందరేశన్ మోటారు బైకుపై చిత్తూరుకు వస్తున్నారు. కిలారిపల్లి వద్ద కుక్కను తప్పించబోయి కిందపడ్డారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో 190 రామాపురం సీఎంసీకి తరలించారు. సతీష్ పరిస్థితి విషమించడంతో తమిళనాడు రత్నగిరి ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కుప్పంలో ట్రాఫిక్ 'లోడింగ్'

● కుప్పం రోడ్లను ఆక్రమిస్తున్న సిమెంటు వ్యాపారులు

కుప్పం, ఆగస్టు 25: కుప్పంలో ట్రాఫిక్ సమస్య రానురాను అధికమవుతోంది. చిన్నపట్టణం అయినా జనాభా నానాటికీ పెరిగిపోతోంది. వాహనాల రాకపోకలతో రోడ్లు నిత్యం రద్దీగా కనిపిస్తున్నాయి. ఇది చాలదన్నట్లుగా కుప్పం రోడ్లను, ట్రాఫిక్ సర్కిళ్లను సిమెంటు వ్యాపారులు ఆక్రమించేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది.

కుప్పంలో హోల్‌సేల్ వ్యాపారులు, మరీ ముఖ్యంగా సిమెంటు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి సిమెంటు తెప్పించుకుని ఇక్కడ విక్రయిస్తుంటారు. వీరికి సరుకు ఆయా ప్రాంతాల నుంచి భారీ కంటైనర్లతోపాటు ఈచర్ వంటి వాహనాలలో సరఫరా అవుతోంది. అయితే ఇలా వస్తున్న సరుకును అన్‌లోడింగ్, లోడింగ్ వంటివి నడిరోడ్ల మీద పట్టపగలే జరుగుతున్నాయి. అంతేకాదు ఆయా దుకాణాలు తెరిచేదాకా నడిరోడ్ల మీదనే భారీ వాహనాలను పార్కింగ్ చేసి ఉంచుతున్నారు. ట్రాఫిక్ సర్కిళ్లను సైతం వీళ్లు వదలడంలేదు. ఆయా సర్కిళ్ల వద్ద వాహనాల రాకపోకలకు వీలు లేకుండా పార్కింగ్ చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఈ సమస్య కొత్తపేట సర్కిల్, బీసీఎన్ కన్వెన్షన్ హాల్ ఎదురుగా గల ట్రాఫిక్ సర్కిళ్ల వద్ద ఎదురవుతోంది. ఈ ప్రాంతంలో జాతీయ రహదారికి అటుఇటు మూడునాలుగు సిమెంటు, కమ్మి దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలకు సంబంధించిన గోదాములు ఇక్కడికి సమీపంలోనే ఉన్నాయి. ఈ గోడౌన్లకు నిత్యం ఒక్కో సిమెంటు షాపునకు కనీసం రోజులో నాలుగైదు సార్లు భారీ కంటైనర్లలో సరుకు వస్తుంటుంది. ఇలావచ్చిన సరుకును ఉదయం నుంచి సాయంత్రం దాకా మంచి రద్దీ వేళల్లోనే అన్ లోడింగ్ చేస్తున్నారు. నడిరోడ్డుపైనే అన్‌లోడింగ్ జరిగిపోతోంది. అన్‌లోడింగ్ మాత్రమే కాదు, భారీ కంటైనర్ల



బీసీఎన్ కన్వెన్షన్ ట్రాఫిక్ సర్కిల్ వద్ద రోడ్డుపై అన్‌లోడింగ్ చేస్తున్న భారీ వాహనాలు (ఫైల్‌ఫొటో)

నుంచి స్థానికంగా వివిధ నిర్మాణాల కోసం ట్రాక్టర్లు, ఇతర చిన్నపాటి వాహనాలకు నడిరోడ్డుపై నిలబెట్టే లోడింగ్ జరుగుతోంది. ఆ సమయాల్లో వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఫ్లైఓవర్ డెడ్ ఎండ్‌లో ట్రాఫిక్ సర్కిల్ ఉంది. ఈ సర్కిల్‌తోపాటు, నడిరోడ్డుపైనే భారీ కంటైనర్లు నిలబెట్టి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండడంవల్ల రోడ్డు దాటేవారికి అసలు ఏమీ కనిపించడంలేదు. ఫ్లైఓవర్ నుంచి అతి వేగంతో వచ్చే వాహనాలను గమనించడానికి వీలు ఉండడంలేదు. ఇందువల్ల రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. స్థానికులు ఈ సమస్యపై సిమెంటు వ్యాపారులకు, వాహనాల డ్రైవర్లకు ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందువల్ల ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి.

● రాత్రి పది తర్వాతే అన్‌లోడింగ్ చేయాలి:

నిజానికి ట్రాఫిక్ నిబంధనల ప్రకారం పగటిపూట అన్‌లోడింగ్ నేరం. లోడింగ్ అయినా, అన్‌లోడింగ్ అయినా రాత్రి పది గంటలు దాటిన తర్వాతే చేసుకోవాలి. ఈ నిబంధన ఏ వ్యాపారులూ పాటించడంలేదు.

● మాటలు ఓకే..చేతలు ఎప్పుడు..?

ఇటీవల కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడు మాట్లాడుతూ సిమెంటు, కమ్మి, లేదా ఎటువంటి హోల్‌సేల్ సరుకునైనా రాత్రి పది గంటలు దాటిన తర్వాతే అన్‌లోడింగ్, లోడింగ్ చేసుకోవాలని లేదంటే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ హెచ్చరికను పోలీసు అధికారులు నిజం చేస్తే తప్ప ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పేలా లేవు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

యూపీఎస్ కాదు ఓపీఎస్ కావాలి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 25: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన యునైటెడ్ పెన్షన్ సిస్టం కాకుండా పాత పెన్షన్ విధానం కావాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖరనాయుడు అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జీపీఎస్‌కు మరో రూపమే యూపీఎస్ అని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్ర కార్యదర్శి రమణ కోరారు. సమావేశంలో సంఘం నేతలు మణిగండ, సుధాకర్, మునిరత్నం, రహనాబేగం తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 25: పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా బాబు అన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో చిత్తూరు సెంట్రల్ మండలా ధ్యక్షుడు షణ్ముగం అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సెప్టెంబరు ఒకటి నుంచి 88000 02024నంబరుకు మిస్డ్ కాల్ ద్వారా సభ్యత్వం చేయాలన్నారు. నేతలు శ్రీనివాసులు, నీరజాక్షులు, సత్యభామ పాల్గొన్నారు.

పాఠశాల వజ్రోత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో పూర్వ విద్యార్థులు

ఐరాల, ఆగస్టు 25: ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలను విజయవంతం చేద్దామని పాఠశాల పూర్వ విద్యార్థులు పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణపై ఆదివారం వారు సమావేశమై చర్చించారు. సూరిమాని సుబ్రహ్మణ్యం, సీఎస్.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 75 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ పాఠశాలలో చదువుకుని ఎంతో మంది ఉన్నత పదవులలో ఉన్నారన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు ఎంతోకొంత సేవ చేయాల్సిన అవసరముందన్నారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు ధనంజయనాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిషోర్, ప్రకాష్‌నాయుడు, నందమనాయుడు, రమేష్‌బాబు, హరినాథగుప్తా పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో నరసన్నపేట ఎమ్మెల్యే



ఐరాల, ఆగస్టు 25: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి ఆదివారం కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు వారికి స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విష్ణుష్ పాల్గొన్నారు.

టైలర్లు కలిసికట్టుగా ఉండాలి



అసోసియేషన్ నాయకులకు సన్మానం

నగరి, ఆగస్టు 25: సమస్యల పరిష్కారానికి టైలర్లు కలిసికట్టుగా ఉండాలని నగరి టైలర్ల అసోసియేషన్ నేతలు కోరారు. అధ్యక్షుడు ఉమాపతి, కార్యదర్శి వీరయ్య, ఉపాధ్యక్షుడు నాగూర్‌బాషా, ప్రధాన సలహాదారు రాజేంద్రన్ ఆధ్వర్యంలో ఆదివారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా మాట్లాడుతూ టైలర్లు కలిసిమెలసి ఉంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఉమాపతి మాట్లాడుతూ టైలర్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. అనంతరం కత్తెరలను అందించారు. కార్వేటినగరం అధ్యక్షుడు దామోదరం, శ్రీకాళహస్తి డైరెక్టర్ రేవతి, పుత్తూరు అధ్యక్షుడు నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

నగరవనాల అభివృద్ధికి రూ.4 కోట్లు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 25: జిల్లా అటవీ శాఖ తూర్పు డివిజన్ పరిధిలోని రెండు నగరవనాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.4 కోట్లు నిధులు కేటాయించింది. కలెక్టర్ కార్యాలయం సమీపంలోని అమూల్ డెయిరీ వెనుక భాగాన 50 హెక్టార్లు, పెనుమూరు మండలం కలిగిరికొండ సమీపంలోని 50 హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధికి రూ.2 కోట్లు చొప్పున మంజూరు చేసింది. ఇందులో కేంద్రం వాటా ఒక్కో నగర వనానికి రూ.1.40 కోట్లు కాగా, రాష్ట్ర వాటా రూ.60 లక్షలుగా నిర్ణయించింది.

ఎంపీ, ఎమ్మెల్యే గోకులాష్టమి శుభాకాంక్షలు

చిత్తూరు సిటీ, ఆగస్టు 25: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రజలకు గోకులాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలతో పల్లెలన్నీ పచ్చగా ఉండేలా కృష్ణ భగవానుడు కరుణించాలని ఆకాంక్షిస్తున్నట్లు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

పగిలిన తాగునీటి పైపులైను



వృథాగా పోతున్న తాగునీరు

చిత్తూరు సిటీ, ఆగస్టు 25: మిట్టూరులోని తానప్పశెట్టి వీధి ఎస్‌బీఐ ఏటీఎం ఎదురుగా తాగునీటి పైప్ లైన్ పగిలిపోయి వారం రోజులుగా నీరు వృథాగా పోతోంది. ఈ విషయమై నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టాలని చెప్పే అధికారులు ఇలా నీరు వృథాగా పోతున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

డాక్టరేట్ ప్రదానం



బంగారుపాళ్యం, ఆగస్టు 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమైఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బంగారుపాళ్యం మండలం మొగిలివెంకటగిరికి చెందిన పాణ్యం శ్రీనివాస శర్మకు బెంగళూరులోని ఓ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. సేవా ధార్మిక కార్యక్రమాలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆయన్ను పలువురు అభినందించారు.

బాలిక అదృశ్యం

చిత్తూరు, ఆగస్టు 25: బాలిక అదృశ్యమైన ఘటన శనివారం చిత్తూరు నగరంలో చోటుచేసుకుంది. కొంగారెడ్డిపల్లెకు చెందిన బాలిక నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. శనివారం ఉదయం కళాశాలకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. తల్లిదండ్రులు, బంధువులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



అన్నదానం చేస్తున్న మాధవ నాయుడు

గుడిపాల, ఆగస్టు 25: మండలంలోని ముట్టుకూరుపల్లిలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల పటాలను అలంకరించి, పుష్పపల్లకిలో ఊరేగించారు. మాధవనాయుడు అన్నదానం, సుబ్రహ్మణ్యం యాదవ్ కుటుంబ సభ్యులు పుష్పపల్లకి సేవ నిర్వహించారు.

యాదవ ఎంప్లాయీస్ సొసైటీ నూతన కార్యవర్గం



గంగాధరనెల్లూరు, ఆగస్టు 25: యాదవ ఎంప్లాయీస్ సొసైటీ మండల నూతన కార్యవర్గాన్ని ఆ సొసైటీ నియోజకవర్గ అధ్యక్షుడు గురుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సుబ్రమణ్యం యాదవ్, అధ్యక్షుడిగా దేవరాజులు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీ ప్రకాష్ యాదవ్, ఉపాధ్యక్షులుగా భూషణయాదవ్, శేషాద్రి యాదవ్, సుబ్రమణ్యం యాదవ్, ఆర్థిక కార్యదర్శిగా భాస్కర్ యాదవ్, మహిళా కార్యదర్శిగా హంస, కార్యదర్శులుగా కుమారి, జ్యోత్స్న, రవి, సోము, యశ్వంత్ ఎన్నికైనట్లు నియోజకవర్గ అధ్యక్షుడు గురుమూర్తి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వెదురుకుప్పం, ఆగస్టు 25: పేకాట స్థావరంపై దాడి చేసి, తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఆదివారం రాత్రి తెలిపారు. కార్వేటినగరం మండలం కొల్లాగుంట సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని, 9 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. రూ.37,830 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వృద్ధులకు అన్నదానం



వెదురుకుప్పం, ఆగస్టు 25: కార్వేటినగరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం ఆర్కేవీబీ పేటకు చెందిన వీఎన్ జ్యోతిప్రసాద్ కుటుంబీకుల వితరణతో అన్నదానం చేశారు. స్వీట్లు పంచిపెట్టారు. దాతల సాయాన్ని వృద్ధులు అభినందించారు.

ముగిసిన కానగలమ్మ తిరునాళ్ల



వెదురుకుప్పం, ఆగస్టు 25: కార్వేటినగరం బోడిబాపన గుంట సమీపంలో ఉన్న కానగలమ్మ ఆలయ తిరునాళ్ల ఆదివారంతో ముగిశాయి. మూడు రోజులుగా ఈ తిరునాళ్ల వైభవంగా జరిగాయి. ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించడంతో పాటు ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కాలభైరవాష్టమి పూజలు ప్రారంభం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 25: కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో ఆదివారం కాలభైరవాష్టమి పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం చేశారు. సాయంత్రం 81 మంది భక్తులతో కలశ స్థాపన చేయించారు. సోమవారం ప్రత్యేక పూజలు చేయనున్నారు. కాలభైరవ ట్రస్టు చైర్మన్ వెంకటేష్, ఆలయ అర్చకులు శివకుమార్ గురుకుల్ పాల్గొన్నారు.

భవిష్యత్తు అవసరాలను పట్టించుకోరా!

- రోడ్డుకు ఆనుకుని విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై విమర్శలు



చిత్తూరు - బలిజకండ్రిగ రోడ్డుకు ఆనుకుని నాటిన విద్యుత్ స్తంభాలు

పాలసముద్రం, ఆగస్టు 25: భవిష్యత్ అవసరాలను పట్టించుకోకుండా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. చిత్తూరు రూరల్ మండలం ఎస్.ఆర్.పేట నుంచి బలిజకండ్రిగ వరకు నూతనంగా 33కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. కన్నికాపురం నుంచి బలిజకండ్రిగ వరకు 13 కి.మీ. సింగిల్ రోడ్డు ఉంది. ట్రాన్స్‌కో అధికారులు రోడ్డుకు 2-3 అడుగుల దూరంలోనే కొత్తగా విద్యుత్ స్తంభాలు నాటుతున్నారు. తద్వారా భవిష్యత్తులో రోడ్డు విస్తరించాలంటే ఈ విద్యుత్ లైన్లు అవరోధంగా మారుతాయని ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం పాలసముద్రం నుంచి బలిజకండ్రిగ వరకు విద్యుత్ స్తంభాలను నాటుతున్నారు. వాహనాలు సైడ్ తీసుకోవాలన్నా, ప్రమాదవశాత్తు అదుపు తప్పినా విద్యుత్ స్తంభాలను ఢీకొట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాహనదారులు చెబుతున్నారు. వైసీపీ నేత కాంట్రాక్టర్ కావడం, ఆయన మాజీ మంత్రి అనుచరుడు కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

వైద్య శిబిరాలను ఉపయోగించుకోండి



ఎమ్మెల్యే మురళీమోహన్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ పంకజాక్షి

పూతలపట్టు, ఆగస్టు 25: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ కోరారు. పాలకూరు గ్రామంలో బెంగళూరుకు చెందిన వైదేహీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారిచే సర్పంచ్ పంకజాక్షి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణులు ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం పలువురు నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. నాయకులు గంగారపు గోపి, ఆర్ఎస్ సుధాకర్ బాబు, భక్తవత్సల నాయుడు, రాజశేఖర్ నాయుడు, నేతాజి, విజయలక్ష్మి, గిరిధర్ బాబు, ప్రతాపనేని చంద్రమౌళి, హిమగిరి నాయుడు, ప్రభాకర్ నాయుడు, హరి, గోపి, నాదముని, నరసింహులు, హేమాద్రి, సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం



గాయపడిన సతీష్‌కుమార్

గుడిపాల, ఆగస్టు 25: మండలంలోని వేలూరు-చిత్తూరు జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ రామ్మోహన్ వివరాల మేరకు.. 190 రామాపురం సీఎంసీలో పనిచేస్తున్న తమిళనాడు రాష్ట్రం విరుదంబట్టుకు చెందిన సతీష్ కృపాకరన్, వేలూరుకు చెందిన సుందరేశన్ మోటారు బైకుపై చిత్తూరుకు వస్తున్నారు. కిలారిపల్లి వద్ద కుక్కను తప్పించబోయి కిందపడ్డారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో 190 రామాపురం సీఎంసీకి తరలించారు. సతీష్ పరిస్థితి విషమించడంతో తమిళనాడు రత్నగిరి ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేత తల్లి మృతికి నివాళి



విజయపురం, ఆగస్టు 25: మండలంలోని మాధవరానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జయరాజ్ తల్లి మాసిలామణియమ్మకు ఆదివారం పలువురు నేతలు నివాళి అర్పించారు. అనారోగ్యంతో మృతి చెందిన ఆమెకు టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి చినబాబు, మండల నాయకులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. చుక్కా ధనుంజయయాదవ్, బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, బాబుయాదవ్, శివలింగం, దశరథరాజు, సుధాకర్‌రాజు, మునిభాస్కర్‌రాజు, కపిల్, శరత్, ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సంస్థాన్‌లో గోకులాష్టమి



బాలవికాస్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 25: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం ముందస్తు గోకులాష్టమి వేడుకలు నిర్వహించారు. బాలవికాస్ పిల్లలు విచిత్ర వేషధారణలతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వీరికి సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

38ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక



బంగారుపాళ్యం, ఆగస్టు 25: మండలంలోని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకుని చదువుకున్న రోజుల్లో చేసిన అల్లర్లను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు కుప్పాల మురళి, గోపాల్ నాయుడు, రంగనాథం తదితరులు ఉన్నారు.

కుక్కలు బాబోయ్!



వెదురుకుప్పం, ఆగస్టు 25: కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ సమీపంలో కుక్కల బెడద ఎక్కువైంది. ఆ ప్రాంతంలో పదుల సంఖ్యలో కుక్కలు తిష్టవేసి, వచ్చే పోయే వారిపై దాడి చేస్తున్నాయి. ఇటీవల ఒక చిన్నారిపై దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆలయాలు ముస్తాబు



పుంగనూరు, ఆగస్టు25: గోకులాష్టమి సందర్భంగా పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద యాదవులు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక కృష్ణమరెడ్డిపల్లె మార్గంలో వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం వేకువజాము నుంచి హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మామిడి, అరటి తోరణాలు కట్టారు. ఉట్టి కొట్టేందుకు ఏర్పాటు చేశారు. యాదవ కులస్తుల ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పపల్లకిలో పురవీధుల్లో ఊరేగించనున్నారు. ఈ కార్యక్రమంలో భజనలు, పిల్లనగ్రోవి, నృత్యాలు, గోమాతల ఊరేగింపు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



చౌడేపల్లె, ఆగస్టు25: విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని మేకలచిన్నేపల్లెకు చెందిన దేవిరెడ్డికి వ్యవసాయంతో పాటు ఆవులు ఉన్నాయి. ఆదివారం గ్రామం సమీపంలోని తన పొలంలో ఆవులు మేత మేస్తుండగా ఓ ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో చనిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆవు రూ.55వేలు ఉంటుందని వాపోయారు.

వైభవంగా లక్ష్మీవెంకటేశ్వరుల కల్యాణం



పలమనేరు, ఆగస్టు 25 : మండలంలోని రామాపురం, రంగినాయనిపల్లి, కమలాపురం గ్రామాలకు సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు అనంత రామాచార్ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం దేవేరులను పుష్పపల్లకిలో ఊరేగించారు. భక్తులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యంలో ఆక్రమణల తొలగింపు

చౌడేపల్లె, ఆగస్టు25: స్థానిక గోసల కురప్పల్లెలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమిలో ఆక్రమణలను ఆలయ ఈవో కమలాకర్ ఆధ్వర్యంలో తొలగించారు. ఆదివారం ఆలయ సమీపంలో ఉన్న మాన్యంలో ఉన్న బంకులు, సెంట్రింగ్ కొయ్యలను గ్రామస్తుల సహకారంతో తొలగించారు. కాగా బస్టాండులో ఉన్న ఆక్రమణలు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి గన్‌మెన్లు, పలువురు వైసీపీ నాయకులు చేపట్టిన అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లకపోవడం గమనార్హం.

మహిళల స్వయం ఉపాధికే లక్‌పతి దీదీ పథకం



మహిళకు చెక్కు అందిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, ఆగస్టు 25: మహిళలు ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి పొందేందుకే లక్‌పతి దీదీ పథకం ప్రవేశపెట్టినట్లు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం జరిగిన లక్‌పతి దీదీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 252 మంది లబ్ధిదారులకు రూ.2.52 కోట్ల మెగా చెక్కును అందించారు. మండలంలో మహిళల కోసం గార్మెంట్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీడీవో శివరాజ్, ఏపీఎం కల్పలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పాల్గొన్నారు.

పాలసముద్రం : మహిళలు ఆర్థికంగా ఎదగాలని వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్ కోరారు. పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వెలుగు అధికారుల ఆధ్వర్యంలో లక్‌పతి దీదీ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీ లైవ్ ప్రోగ్రామ్‌ను డ్వాక్రా సభ్యులు, వెలుగు సీసీలు, సంఘమిత్రలు వీక్షించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే బ్యాంకు ద్వారా రూ.లక్ష రుణం మంజూరు చేయిస్తామన్నారు. మండలంలో 10 సంఘాలకు రూ.1.37 కోట్ల చెక్కును అందజేశారు. టీడీపీ నేతలు వాసు నాయుడు, శేఖర్ రాజు, సీఆర్పీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

గుడిపాల : మహిళలు స్వయంశక్తితో లక్షాధికారులు కావాలని ఏపీఎం సుధారాణి, ఎంపీటీసీలు విజయలక్ష్మి, గోళ్ల హరిప్రసాద్ చౌదరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన లక్‌పతి దీదీ కార్య క్రమాన్ని వీక్షించారు. మహిళా గ్రూపు సభ్యులకు, సంఘమిత్రలకు సర్టిఫికెట్లు అందజేశారు. తెలుగు మహిళ మండలాధ్యక్షురాలు ఉదయ, వెలుగు సీసీలు మల్లీశ్వరి, లోకనాథం రెడ్డి, హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకుని లక్షాధికారులుగా ఎదగాలన్న ఎమ్మెల్యే మురళి

గంగాధరనెల్లూరు : పేద కుటుంబాల వారిని లక్షాధికారులుగా చేయడమే లక్‌పతీ దీదీ పథకం ప్రధాన లక్ష్యమని టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. ఎంపీడీవో మీటింగ్ హాలులో ఆదివారం పలువురు మహిళలు రుణాలకు ఎంపికైనట్లు పత్రాలను టీడీపీ, జనసేన నేతలు, అధికారులు కలిసి పంపిణీ చేశారు. టీడీపీ నేతలు వెంకటేష్, స్వామిదాస్, దేవసుందరం, జ్యోతిరెడ్డి, రఘునాథనాయుడు, జ్యోతియాదవ్, షణ్ముగం, జనసేన నేతలు యుగంధర్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం : మహిళా సంఘాల సభ్యులను లక్షాధికారులను చేయడమే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి తెలిపారు. ఆదివారం వెదురుకుప్పం ఎంపీడీవో సమావేశపు కార్యాలయంలో ఏపీఎం కవిత ఆధ్వర్యంలో రూ.4.90కోట్ల మెగా చెక్కు పంపిణీ చేశారు. లక్‌పతీ దీదీ పథకంపై అవగాహన కల్పించారు. టీడీపీ నేతలు గురుసాల కిషన్‌చంద్, బట్టే చాణిక్యప్రతాప్, గాలిబాబునాయుడు, పోటుగారి గంగయ్య, సర్పంచ్ నాథరెడ్డి, బీజేపీ నేతలు పాముల శేషాద్రికుమార్, బోడిరెడ్డి హనుమంతరెడ్డి హాజరయ్యారు.

కార్వేటినగరం : వెలుగు కార్యాలయంలో లక్‌పతీ దీదీపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల్లో ఎంపికైన వారికి లక్ష రూపాయలు ఇచ్చి వ్యాపారం, పాడి పరిశ్రమ, చిన్నతరహా పరిశ్రమలు పెట్టి లక్షాధిపతులు చేయడమే లక్ష్యంగా మెగా చెక్కు అందజేశారు.